వసూళ్లు సరే.. పంపిణీ ఏదీ?

- గ్రంథాలయ సెస్ వంపకంలో అలసత్వం
- రూ.4 కోట్లు బకాయి పడిన కార్పొరేషన్
- నిధులు విడుదల చేస్తేనే

సంస్థ అభివృద్ధి అంటున్న అధికారులు



జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయం

బాలాజీచెరువు: పన్నులు చెల్లించకపోతే ముక్కు పిండి వసూలు చేసే కార్పొరేషన్ అధికారులు వాటి పంపిణీలో మాత్రం తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. పన్ను రసీదులో గ్రంథాలయ సెస్సు నిమిత్తం అని కొంత మొత్తాన్ని ప్రజల నుంచి వసూలు చేసే విషయం పాఠకులకు తెలిసిందే. మొత్తం పన్నుల్లో అంతర్భాగంగా ఉండే ఈ సెస్సును సదరు గ్రంథాలయ సంస్థకు కేటాయించడంలో జాప్యం చేస్తున్నారు. కార్పొరేషన్ నుంచి మొత్తం రూ.4 కోట్లు రావాల్సి ఉంది. జిల్లాలోని కాకినాడ కార్పొరేషన్ జిల్లా గ్రంథాలయ సంస్థకు సెస్సు చెల్లించకపోవడం అభివృద్ధికి అడ్డంకిగా మారింది. స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న సెస్సు సంస్థకు అందితే అభివృద్ధి పనులు, వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు వీలవుతుంది. గ్రంథాలయాలకు వచ్చే వారంతా నిరుద్యోగులు కావడంతో వారికి పోటీ పరీక్షల సామగ్రి, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. అయితే సెస్సు నిధులు గ్రంథాలయ సంస్థకు అందనందున అధికారులు దీనిపై స్పష్టమైన చర్యలు చేపట్టలేకపోతున్నారు. ఫలితంగా వసతుల లేమితో పాఠకులు సతమతమవుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు మొర పెట్టుకున్న చెల్లించకపోవడంతో గ్రంథాలయాలకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. నగరంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంతో పాటు గ్రేడ్–1 రెండు, గ్రేడ్ –2 రెండు, గ్రేడ్–3లో 2 ఉండగా పుస్తక నిక్షిప్త గ్రంథాలయాలు (బీడీసీలు) పది వరకూ ఉన్నాయి. బీడీసీ నిర్వహణకు ఒకొక్కదానికి ప్రతి నెలా మూడు వేలతో పాటు పేపర్ నిర్వహణకు నెలకు వెయ్యి రూపాయలు గ్రంథాలయ సంస్థ చెల్లిస్తుంది. స్థానిక సంస్థలు నూటికి ఎనిమిది రూపాయలు గ్రంథాలయం సెస్సు పేరుతో వసూలు చేస్తారు. పన్నులు వసూలు చేసేటప్పుడు గ్రంథాలయ సెస్సు వసూలు చేసి వాటిని తిరిగి జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాలి. అది జరగకపోవడంతో ఏటేటా గ్రంథాలయాలు గత కాలపు ప్రభను కోల్పోతున్నాయి.

అధికారులు స్పందించడం లేదు



గ్రంథాలయాలకు చెల్లించాల్సిన సెస్సును ఆయా స్థానిక సంస్థలకు చెల్లించాలని నోటీసులు పంపుతున్నాం. ప్రజల నుంచి పన్ను వసూలు చేస్తున్నా, తిరిగి గ్రంథాలయ సంస్థకు చెల్లించడం లేదు. తమకు రావలసిన నిధులు వస్తే గ్రంథాలయాల్లో మెరుగైన వసతులు, మరిన్ని పుస్తకాలు పాఠకుల కోసం అందుబాటులోకి తెచ్చే అవకాశం ఏర్పడుతుంది. ఈ విషయంపై జిల్లా స్థాయి అధికారులకు విన్నపించాము. 2021–22లో కొంతమేర చెల్లించారు. ఈ ఏడాది సెస్సు చెల్లించలేదు.

– వీఎల్ఎస్ఎస్‌వీ ప్రసాద్,
జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

క్లుప్తంగా

పారదర్శకంగా ఓటరు జాబితా



పోలింగ్ బూత్ స్థాయి అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సత్యనారాయణ

బోట్‌క్లబ్: ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని ఆర్డీఓ ఎస్వీవీ సత్యనారాయణ బూత్‌స్థాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ ఆర్డీఓ కార్యాలయంలో కాకినాడ రూరల్ నియోజవర్గ బూత్ స్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు. గత నెల 21న ప్రారంభమైన ఓటర్ల జాబితా ముసాదాకు సంబంధించి రూరల్ నియోజవర్గంలో రెండు లక్షల 54 వేల మంది ఓటర్లకు ఇప్పటి వరకూ 24,348 ఇళ్లను సందర్శించి 47,786 మంది ఓటర్లను గుర్తించామన్నారు. బూత్ స్థాయి అధికారులు రోజువారి లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళిబద్ధంగా, పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. రూరల్ తాహసీల్దార్ మురార్జీ పాల్గొన్నారు. అనంతరం రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

బాధ్యతగా పనిచేయాలి



వలంటీర్లకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

కరప: గ్రామ వలంటీర్లు బాధ్యతగా పనిచేస్తూ, ప్రభుత్వానికి, గ్రామానికి మంచిపేరు తీసుకుని రావాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కూరాడ, వేములవాడ, గొర్రిపూడి గ్రామాల నుంచి కొత్తగా ఎంపికైన వలంటీర్లకు ఆమె నియామక ఉత్తర్వులు అందజేశారు. ఎంపీడీఓ కె.అప్పారావు మాట్లాడుతూ గ్రామవలంటీర్లు తమ గ్రామ కార్యదర్శి, సర్పంచ్‌ల సూచనల మేరకు పనిచేయాలన్నారు. ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, కమిడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన



విద్యార్థినులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సమీరా ఆలూరి

కాకినాడ రూరల్: స్థానిక ఆదికవి నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడలో సెర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మహిళా విద్యార్థులను ఉద్దేశించి సెంటర్ ఫర్ ఎంపవరింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ వుమెన్ (సిడో) అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కమలకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ సమీరా ఆలూరి మహిళల్లో వచ్చే సర్వైకల్ క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, జీవన విధానాన్ని వివరించారు. ఏఐడబ్ల్యూసీ ట్రెజరర్ పద్మజారాణి, ఏఎస్‌డీ వుమెన్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉషారాణి, సంధ్య, అలివేణి, విద్యార్థినులు అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

రేపు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

కరప: మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గురువారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌పై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎంపీడీఓ కె.అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామ పంచాయతీల్లో సమావేశాలు నిర్వహించి, కార్యదర్శులు ప్రతిజ్ఞ చేయించాలన్నారు. ఈ సందర్భంగా అంగ్‌దాన్ మహోత్సవ్ నిర్వహించి అవయవ దానంపై అవగాహన కల్పించాలన్నారు. బ్రెయిన్ డెడ్ గురించి వివరించి, అటువంటి వారు ఆర్గాన్ డొనేషన్ (అవయవ దానం) చేస్తే మరికొంతమందికి జీవితాన్ని ప్రసాదించిన వారవుతారని అవగాహన కల్పించాలని కోరారు. మండల పరిధిలో అటువంటివారుంటే వారి నుంచి డిక్లరేషన్ తీసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

57.36 శాతం పింఛన్ల పంపిణీ

కరప: మండల పరిధిలోని 23 గ్రామాల్లో 11,221 మందికి వివిధ రకాల పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా మంగళవారం 6,436 మందికి (57.36 శాతం) పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. అన్ని రకాల పింఛన్ల సొమ్ము రూ.3,06,02,250 లబ్ధిదారులకు ఇవ్వాల్సి ఉండగా రూ.1,75,15,750 పంపిణీ చేసినట్టు తెలిపారు. పలు సాంకేతిక లోపాలతో నూరుశాతం పంపిణీ జరగలేదని ఎంపీడీఓ తెలిపారు. బుధ, గురువారాల్లో నూరుశాతం పూర్తి చేయిస్తామని ఆయన చెప్పారు. వాకాడ గ్రామ సచివాలయంలో 74.91 శాతం, కొరిపల్లి గ్రామ సచివాలయం 69.64 శాతం, ఉప్పలంక గ్రామ సచివాలయం 67.44 శాతంతో పింఛన్లు పంపిణీ చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

12న మెగా యూత్ మీట్



వేళంగి చర్చిలో పాస్టర్లకు అందజేస్తున్న మెగా యూత్ మీట్ పోస్టర్లు

కరప: జి.భావారం సియోను మెమోరియల్ పెంత్‌కోస్తు చర్చిలో ఈనెల 12న ఉదయం 10 గంటలకు యంగ్ ఫర్ క్రైస్ట్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మెగా యూత్ మీట్ నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజర్ కె.షెకెముబాబు తెలిపారు. వేళంగిలోని పెంత్‌కోస్తు చర్చిలో మంగళవారం జరిగిన యంగ్ ఫర్ క్రైస్ట్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మెగా యూత్ మీట్‌లో డాక్టర్ బిషప్.ప్రసాద్‌పాల్ (మండపేట అపోస్తలిక్ కింగ్స్ టెంపుల్) పాల్గొని వాక్యోపదేశం చేస్తారన్నారు. ఈ సందర్భంగా మెగాయూత్ మీట్ పోస్టర్స్‌ను విడుదల చేశారు. పాస్టర్లు ఎస్.రవికుమార్, సాల్మన్‌రాజు, ఆనంద్, వరప్రసాద్, రమేష్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల రక్షణకు పూర్తి సహకారం



ఎమ్మెల్యే కన్నబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూకాలయ్మ ఆలయ ఈఓ చందన

కాకినాడ రూరల్: నియోజకవర్గ పరిధిలోని దేవదాయ, ధర్మధాయ ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షణగా ఉన్నామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. పూర్వీకుల విలువైన ఆస్తులను ఆధ్యాత్మికంగా ఆలయాలు, సత్రాలు పేరిట దానం ఇచ్చారని వాటిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాకినాడ అన్నదాన సమాజం, రమణయ్యపేటలోని నూకాలయ్మ ఆలయ ఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఆర్వీ చందన తొలిసారిగా రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే కన్నబాబును కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నూకాలమ్మ ఆలయానికి విలువైన భూములు ఉన్నాయని వాటిని కాపాడంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. తాను ఆలయాలు అభివృద్ధి చేయడంతో పాటు ఆలయాల ఆస్తుల పరిరక్షణకు అధికారులకు నూటికి వెయ్యి శాతం సహకరిస్తానన్నారు. నూకాలమ్మ ఆలయానికి విలువైన ఆస్తులుగా మాన్యం ఉందని, దానిని కొందరు ప్రైవేట్ వ్యక్తులు తమ ఆస్తిగా చూపే ప్రయత్నంలో చాలాసార్లు అడ్డుకున్నామని అన్నారు.

రోడ్లపై పశువులు సంచరిస్తే కఠిన చర్యలు

కరప: రోడ్లపై పశువులు తిరుగుతూ ప్రమాదాలకు కారణం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఈఓ పీఆర్డీ ఎస్వీవీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలో నడకుదురు నుంచి వేళంగి వరకు, పెనగుదురు నుంచి విజయరాయుడుపాలెం వరకు ప్రధాన రహదారిపై సంచరిస్తున్న పశువులను గుర్తించి, వాటి యజమానులకు నోటీసులు జారీచేయాలని గ్రామ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. పశువులను బయటకు వదలకూడదని, అలాచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. రోడ్డుపై సంచరిస్తున్న పశువులను బందెల దొడ్డికి తరలించి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. క్లెయిమ్ చేయబడని ఆవులను సమీపంలోని గోశాలకు తరలిస్తామని ఈఓ పీఆర్డీ శ్రీనివాసరావు తెలిపారు.

మత్తు పదార్థాలు నిషేధించాలి



జెడ్పీసెంటర్‌లో యాత్రకు స్వాగతం పలుకున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

బోట్‌క్లబ్: మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారాలకు కారణమైన మద్యం, మత్తు పదార్థాలు నిషేధించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి డిమాండ్ చేశారు. హింసకు వ్యతిరేకంగా ఐద్వా ఆధ్వర్యంలో విశాఖపట్నం నుంచి ఈ నెల 28న బస్సు ద్వారా బయలుదేరిన పోరు యాత్ర మంగళవారం కాకినాడ చేరుకుంది. స్థానిక జెడ్పీ సెంటర్ వద్ద స్థానిక ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు, మహిళలు స్వాగతం పలికారు. మహిళల రక్షణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని, పోర్న్ వెబ్‌సైట్‌లు నిషేధించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.నాగజ్యోతి, భూలక్ష్మి, భవాని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై కాంగ్రెస్ నిరసన



కల్పనా సెంటర్ వద్ద నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాకినాడ: మణిపూర్ ఘటనపై బీజేపీ వైఫల్యాన్ని ఎండగడుతూ స్థానిక కల్పనా సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేశారు. కాంగ్రెస్ కార్యాలయం నుంచి ప్రదర్శనగా వెళ్ళి అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు మాట్లాడుతూ మణిపూర్ హింసాకాండపై ప్రధాని మోడీ ఇప్పటి వరకు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఆయన తీరు వల్ల ప్రజల్లో అభద్రతాభావం నెలకొందన్నారు. పీసీసీ సభ్యుడు ఆకుల వెంకటరమణ మాట్లాడుతూ మణిపూర్ ఘటనలో మహిళల పట్ల జరిగిన హింసాకాండ దేశ ప్రజలందరినీ ఆందోళనకు గురిచేసిందన్నారు.

క్లాప్ డ్రైవర్ల వేతనాలు పెంచాలి

కాకినాడ: వేతనాలను పెంచి వారంతరపు సెలవులు మంజూరు చేయాలని కోరుతూ క్లీన్ ఆంధ్రప్రదేశ్ డ్రైవర్లు మంగళవారం నగరపాలక సంస్థ పాత భవనం వద్ద ఆందోళన చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఎం.శివశంకర్, సీఐటీయూ నగరాధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లకు 18,500 రూపాయలు కనీస వేతనాన్ని ఇచ్చి ఇతర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. యూనియన్ ప్రతినిధులు ఎం.శివశంకర్, టి.గంగాధర్, ఎస్.సూరిబాబు, డ్రైవర్ల సంఘ నాయకులు మందపల్లి సూర్యప్రకాష్, ప్రసాద్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ నాయకత్వానికి తరగని ఆదరణ

- పార్టీలో చేరికలే దానికి నిదర్శనం
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



ఎమ్మెల్యే ద్వారంపూడి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన స్వర్ణకార సంఘం నాయకులు

కాకినాడ: ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై అన్ని వర్గాల్లో విశేష ఆదరణ కనిపిస్తోందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు, నగర టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు, త్రిపుర సుందరి ఆలయ కమిటీ ట్రస్టు మాజీ సభ్యుడు అరటికట్ల రాంబాబు, కమిటీ సభ్యులు వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక తిలక్ వీధిలోని వెండి బంగారు సత్రంలో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సమక్షంలో రాంబాబుతో పాటు సుమారు 30 మంది సంఘ సభ్యులు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ద్వారంపూడి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్ నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. స్వర్ణకారులకు అన్ని విధాల అండగా ఉంటామని, ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతిపక్షాలు ఎంతగా దుష్ప్రచారం చేసినా జగన్ నాయకత్వ పటిమపై అన్ని సంఘాల ప్రజల్లో అపూర్వ ఆదరణ కనిపిస్తోందని ద్వారంపూడి పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారంతా సీఎం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి కష్టించి పనిచేయాలని పిలుపునిచ్చారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, త్రిపుర సుందరి ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, జేసీఎస్ కన్వీనర్ సుంకర సాగర్, యువ నాయకులు మల్లిపాముల గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఐపీసీ కోర్సులలో ప్రవేశాలకు కౌన్సెలింగ్



విద్యార్థులకు అడ్మిషన్ అందజేస్తున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే, స్వీడన్ బీటీహెచ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కొలాబరేటివ్ (ఐపీసీ) కోర్సుల్లో ప్రవేశాలకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రవేశాలకు 61 మంది దరఖాస్తు చేసుకున్నారు. సీఎస్ఈ 15, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్,మెషిన్ లెర్నింగ్(ఏఐఎంఎల్)లో ఇద్దరికి ప్రవేశాలు కల్పించారు. బీటీహెచ్ ప్రతినిధి గురుదత్, జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు,రిజిస్ట్రార్ సుమలత ఫారస్ వర్సిటీ డైరెక్టర్ శివనాగరాజు,అడ్మిషన్ డైరెక్టర్ ఎం.ఎం.ప్రసాద్, పాల్గొన్నారు.

కొండబాబూ.. ఒక్క ఇల్లయినా ఇచ్చావా?

- ఏటిమొగను నిర్లక్ష్యం చేసింది నిజం కాదా?
- ధ్వజమెత్తిన ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు 2014–19 మధ్య కాలంలో ఏటిమొగ ప్రాంతంలో ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయించలేకపోయారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ధ్వజమెత్తారు. సొంత మత్స్యకార వర్గానికి కూడా ఆయన హయాంలో న్యాయం చేయలేకపోయారన్నారు. స్థానిక 14వ డివిజన్ ఏటి మొగలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఏటిమొగ ప్రాంతీయులు తనకు మెజార్టీ ఇవ్వకపోయినా తాను మాత్రం పార్టీలకు అతీతంగా అందరి శ్రేయస్సు కోరి 1200 మందికి ఇళ్లు మంజూరు చేశానన్నారు. కొండబాబు తన హయాంలో ఒక్క ఇల్లు మంజూరు చేసినట్లు నిరూపించినా రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఎమ్మెల్యే ద్వారంపూడి సవాల్ చేశారు.

దళారులు లేని సేవల కోసమే జగనన్న సురక్ష

దళారీ వ్యవస్థకు దూరంగా ప్రజలకు మరింత దగ్గరగా ప్రభుత్వ సేవలు అందాలనే లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం రూపొందించినట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురం 14వ డివిజన్ ఏటి మొగ ప్రాంతంలో మంగళవారం ప్రజలకు మంజూరైన ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే ద్వారంపూడి పంపిణీ చేశారు. వివిధ ధ్రువపత్రాల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఈ కార్యక్రమం వెసులుబాటు కల్పించిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి ప్రజల అవసరాలను తెలుసుకుని పరిష్కరించే ఇలాంటి వినూత్న పథకం ఎక్కడాలేదన్నారు. ప్రజల కోసం ఆలోచించే ముఖ్యమంత్రి అధికారంలో ఉండడం వల్లే ఇటువంటి మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ప్రజల ప్రయోజనాలు, అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిరంతరం పనిచేసే ఇటువంటి ముఖ్యమంత్రికి ప్రజలంతా అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ కార్పొరేటర్ చోడిపల్లి ప్రసాద్, భీమరాజు, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌పై కార్పొరేషన్ కొరడా

- 49 చోట్ల దాడులు
- 350 కిలోల సరుకు స్వాధీనం
- రూ.21 వేలు అపరాధ రుసుం వసూలు



దాడుల్లో పట్టుబడ్డ క్యారీబ్యాగ్‌లు

కాకినాడ: నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నగరపాలక సంస్థ కొరడా ఝుళిపించింది. మంగళవారం కాకినాడలో విస్తృత దాడులు చేసి పెద్ద ఎత్తున కేసులు నమోదు చేసింది. 49 చోట్ల తనిఖీలు నిర్వహించి 350 కేజీల ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆయా దుకాణాలపై రూ.21 వేలు అపరాధ రుసుం వసూలు చేశారు. కమిషనర్ మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పర్యవేక్షణలో ప్రజారోగ్య విభాగం ఈ తనిఖీలు నిర్వహించింది. చిన్నచిన్న దుకాణాల నుంచి ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను విక్రయించే షాపులు, విజయవాడ నుంచి రవాణా అవుతున్న సరుకును కూడా దాడుల్లో పట్టుకున్నారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ సమక్షంలో శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, ఇతర ఉద్యోగులు వార్ఫు రోడ్డులోని ఓ ట్రాన్స్‌పోర్టు కంపెనీలో తనిఖీలు నిర్వహించారు. హనుమాన్ జంక్షన్ నుంచి వచ్చిన 200 కేజీల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ సరుకు తీసుకోవలసిన దుకాణాన్ని కూడా తనిఖీ చేశారు. పర్యావరణాన్ని, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని నిషేధిత క్యారీ బ్యాగ్‌లను విక్రయించవద్దని, పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని పృథ్వీచరణ్ హెచ్చరించారు. తనిఖీల్లో శానిటరీ సూపర్‌వైజర్ జిలానీ, ఆయా ప్రాంతాల్లోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

6247 ఇళ్లు మంజూరు చేయండి

కేంద్రమంత్రికి ఎంపీ గీత వినతి



కేంద్రమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ వంగా గీత

కాకినాడ: నియోజకవర్గంలోని పేదల సొంతింటికల నెరవేర్చేందుకు 6247 నూతన ఇళ్లను మంజూరు చేయాలని ఎంపీ వంగా గీత కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖామంత్రి హరిదీప్‌సింగ్‌పూరికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆమె ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో ప్రభుత్వమే భూమిని కొనుగోలు చేసి 33 లక్షల మంది మహిళల పేరుతో పట్టాలు మంజూరు చేసి పంపిణీ చేసిన విషయాన్ని కేంద్రమంత్రికి వివరించారు. ఇందులో భాగంగా కాకినాడ సిటీ పరిధిలో 33వేల మందికి చరిత్రలో తొలిసారిగా పట్టాలు మంజూరు చేశామని పేర్కొన్నారు. చొల్లంగి, పటవల గ్రామాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న మత్స్యకార, పేద కుటుంబాలకు 6247 ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. ఈ లబ్ధిదారులు వేగంగా ఇళ్ల నిర్మాణం జరగాలని కోరుకుంటున్నారని, వీరి ఆకాంక్ష నెరవేర్చేందుకు వీలుగా సత్వరమే ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్ల నిర్మాణానికి కొత్త డీపీఆర్ ప్రతిపాదనల కోసం కేంద్రానికి కూడా పంపామని ఆమె కేంద్రమంత్రికి వివరించారు. రాష్ట్రస్థాయి ప్లానింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పరిగణనలోకి తీసుకుని త్వరలో వీటిని ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు.

ఏటిపట్టులో సినిమా చిత్రీకరణ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నూతన దర్శకుడు రాజేష్ జగన్నాథం

పెద్దాపురం: స్థానిక ఏటిపట్టు గ్రామాల్లో 12 రోజుల పాటు సినిమా చిత్రీకరణ చేయనున్నట్టు నూతన దర్శక, నిర్మాత రాజేష్ జగన్నాథం తెలిపారు. మండలంలోని కాండ్రకోట గ్రామంలో చిత్ర యూనిట్‌తో కలసి మంగళవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ థ్రిల్లర్‌గా రూపొందించనున్న ఈ చిత్రాన్ని కాండ్రకోట, సిరివాడ, తిరుపతి తదితర గ్రామాల్లో చిత్రీకరించనున్నామన్నారు. వరుణ్‌సందేశ్ కథానాయకుడుగా, రెండో కథ నాయకుడిగా సిద్ధార్థ్ నటిస్తున్నారన్నారు. కథా నాయికలుగా శ్రేయారాణి, అణి, మధు నటిస్తున్నారు.

ఈటీసీలో కొనసాగుతున్న శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం, ఏపీఓలకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ మంగళవారం కొనసాగింది. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాలోని అధికారులకు ఇస్తున్న శిక్షణలో భాగంగా ప్రతి గ్రామంలో మునగచెట్ల పెంపకానికి ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. రెండో రోజు శిక్షణలో ఫ్యాకల్టీలు గౌరీశంకర్, నరేష్‌బాబు, ఎంఎస్ఎన్ రెడ్డి, కేఎస్ఆర్‌కే నిహారిక, పి. శ్రీనివాస రావు, ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. అనంతరం సాయంత్రం మునగ తోటలపై ఫీల్డ్ విజిట్ నిర్వహించారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో మొక్కలు పంపిణీ చేస్తున్న రత్నప్రసాద్ తదితరులు

కాకినాడ రూరల్: మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో మంగళవారం మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పండూరు పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీ వాసంశెట్టి సంతోషి సత్య, గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.